


www.tharanam.net

# తరణం

THARANAM

POSTAL REG-NUMBER CDP/035/2023-2025

RNI NO APTEL/2016/69526

**తరణం శుభమస్తు**

గురువారం సెప్టెంబర్ 05 2024

శ్రీ క్రోధి నామ సంవత్సరందక్షిణాయణం - వర్ష ఋతువుభాద్రపద మాసం - శుక్ల పక్షం

తిథి:విదియ వారం:గురువారం(బృహస్పతి వాసరే)

నక్షత్రం:హస్త దుర్ముహూర్తము:ఉ9.55 - 10.45

మరల మ2.51 - 3.41

అమృతకాలం:రా1.15 - 3.01

రాహుకాలం:మ1.30 - 3.00

యమగండ/కేతుకాలం:ఉ6.00 - 7.30

సర్వేజనా సుఖినో భవంతు -శుభమస్తు

వి మల్లికార్జున స్వామి

సంపుటి : 09 సంచిక : 08 వైఎస్ఆర్/కడప గురువారం 05 సెప్టెంబర్ 2024 ఎడిటర్.. నీలం ఆంజనేయ రెడ్డి పేజీలు :08 వెల: రూ. 4.00

Vol : 09 Issue : 08 YSR/KADAPA Thursday, 05 September 2024 Editor. Neelam .Anjaneya Reddy Pages:08 Rs. 4.00

## వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనున్న కేంద్ర బృందం



హైదరాబాద్: సెప్టెంబర్ 04. (తరణం బ్యూరో)భారీ వర్షాలతో ఏపీ, తెలంగాణలో భారీగా నష్టం వాటిల్లిన నేపథ్యంలో వెంటనే ఏరియల్ సర్వే చేయించాలని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి..కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తెచ్చారు. దీనిపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఏరియల్ సర్వేకు కేంద్రం సిద్ధమైంది. మరికొద్ది సేపట్లో అధికారికంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేయనుంది. కేంద్ర మంత్రి ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం తెలుగు రాష్ట్రాల్లోని దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనుంది.

## భారత్-బ్రూనై మధ్య నేరుగా విమాన సర్వీసులు.

### . మోదీ కీలక ప్రకటన

ఇంటర్నెట్ డెస్క్: సెప్టెంబర్ 04. (తరణం బ్యూరో)బ్రూనై పర్యటన సందర్భంగా ఆ దేశ సుల్తాన్ హాజీ హసనల్ బోల్కియాతో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ భేటీ అయ్యారు.రక్షణ, వాణిజ్యం, ప్రాంతీయ సహకారం వంటి ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. త్వరలో ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.బుధవారం ఉదయం సుల్తాన్ అధికారిక నివాసం ఇస్తానా నురుల్ ఇమాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి బోల్కియా), ఆయన కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ విజన్‌లో బ్రూనై మాకు ముఖ్య భాగస్వామి. ఇరు దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను పరస్పరం గౌరవించుకుంటాం. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య



వ్యూహాత్మక, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్వసిస్తున్నా" అని మోదీ వెల్లడించారు.

## వరద బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు:

### సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: సెప్టెంబర్ 04. (తరణం బ్యూరో)వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా అంబులెన్స్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యలపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ప్రతి కుటుంబానికి సాయం అందించాలన్నారు. వరదల్లో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించాలని చెప్పారు. ఎవరూ రాకపోతే ప్రభుత్వం తరఫునే గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సచివాలయంలో ఒక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు."వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి నిత్యావసరాలు అందజేయాలి. 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంపలు, కిలో చక్కెర ఇవ్వాలి. మొబైల్ రైతుబజార్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు కూరగాయలు అందజేయాలి. ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా చర్యలు చేపట్టి సాధారణ స్థితికి తీసుకొస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారాన్ని ప్రభుత్వం తరఫున



అందించాలి. జ్వరాల నుంచి జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలి. ఎవరికి ఏ మెడిసిన్ కావాలన్నా అందుబాటులో ఉంచాలి. పంటనష్టంపై అంచనాలు నమోదు చేయాలి" అని చంద్రబాబు తెలిపారు.

## 100 ఫైరింజన్లు, 2,100 మంది సిబ్బందితో బురద తొలగింపు పనులు:

### సీఎం చంద్రబాబు



విజయవాడ: సెప్టెంబర్ 04. (తరణం బ్యూరో) వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందకుపైగా ఫైరింజన్లు సహాయక చర్యలో పాల్గొన్నాయని, పొక్లెయిన్లు, టిప్పర్ల ద్వారా వేస్టేజ్‌ను తరలిస్తున్నామని తెలిపారు."సహాయచర్యల్లో 32 మంది ఐఏఎస్‌లు పనిచేస్తున్నారు. 179 సచివాలయాలకు 179 సీనియర్ అధికారులకు ఇన్‌ఛార్జులుగా పెట్టాం. ఎవరైనా చనిపోతే మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని ఆదేశాలిచ్చాం. మంగళవారం 9,09,191 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. ఇవాళ ఇప్పటి వరకు 6లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. 8.50లక్షల వాటర్ బాటిళ్లు, 3లక్షల లీటర్ల పాలు, 5లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందించాం. 5లక్షల మందికి భోజన ఏర్పాట్లు చేశాం. గర్భిణిలకు ప్రత్యేక వైద్యం అందించాలని ఆదేశాలిచ్చాం. విజయవాడకు బుడమేరే ప్రధాన సమస్య..విజయవాడకు బుడమేరు ప్రధాన సమస్యగా తయారైంది. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారింది. అటు కృష్ణానది, ఇటు బుడమేరు కలిసి విజయవాడను ముంచెత్తాయి. బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లపాటు ఏం చేశారని వైకాపా నేతల్ని ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆఖరికి పోలవరం కాలువలోనూ మట్టిని తవ్వేశారు. బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. వైకాపా నేతలు తప్పులు చేసి తిరిగి ఎదురుదాడి చేస్తున్నారు. అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదు. ఇలాంటి విపత్తులను అందరూ సమష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం. రేపు ఉదయానికి వరద పూర్తిగా తగ్గిపోతుంది"అని చంద్రబాబు తెలిపారు.

## పారాలింపిక్స్‌లో భారత్ కొత్త రికార్డు..

### అథ్లెట్లకు ప్రధాని మోదీ ఫోన్



ఇంటర్నెట్ డెస్క్: సెప్టెంబర్ 04 (తరణం బ్యూరో)పారాలింపిక్స్‌లో భారత్ 20 పతకాలు సాధించి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. గత టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలను సాధించిన భారత అథ్లెట్లు..ఇప్పుడా సంఖ్యను దాటేశారు. ఇంకా పతకాంశాలు మిగిలే ఉన్నాయి. దీంతో టీమ్‌ఇండియా మెడల్స్ మరిన్ని పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అథ్లెట్లతో ప్రత్యేకంగా సంభాషించారు. పతకాలు గెలిచిన అథ్లెట్లకు అభినందనలు తెలిపారు. బరిలో నిలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ బ్రూనై నుంచి సింగపూర్ పర్యటనకు మోదీ బయల్దేరారు. బ్రూనైలో అధికారిక సమావేశాలు ముగిసిన అనంతరం అథ్లెట్లతో మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. పతకాలు సాధించిన దీప్తి జీవాంజి, మరియప్పన్ తంగవేలు, శరద్ కుమార్, సుందర్ సింగ్ గుర్జార్, అజీత్ సింగ్ తదితరులను అభినందిస్తూ మోదీ ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈసారి లక్ష్యం 25..పారాలింపిక్స్ ప్రారంభానికి ముందు భారత్ 25 పతకాలను లక్ష్యం చేసుకొని బరిలోకి దిగింది. మొత్తం 84 మందితో కూడిన అథ్లెట్ల బృందం పారిస్‌కు చేరుకుంది. టోక్యో రికార్డును అధిగమించిన భారత్.. 'పాతిక' టార్గెట్‌ను కొట్టడం కష్టమేం కాదు. కేంద్రం నుంచి పారా అథ్లెట్లకు పూర్తిస్థాయిలో సహకారం లభించడం వల్లే ఇదంతా సాధ్యమైంది. అత్యున్నత స్థాయిలో శిక్షణ, పరికరాలు, విదేశీ నిపుణుల సూచనలు అందేలా చేయడం, సాయ్ క్రీడా కేంద్రాల్లో సాధన కీలక పాత్ర పోషించాయి. క్రీడాకారులను సమాయత్తం చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో 110కిపైగా పోటీలకు పంపించింది. పారాలింపిక్స్‌లో పతకాల వేటకు బరిలోకి దిగిన అథ్లెట్ల కోసం రూ.22 కోట్లు కేటాయించగా.. క్వాలిఫైడ్ అంశాల కోసం రూ. 74 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

## వైకాపా నేతలు ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదు:

### పవన్

అమరావతి: సెప్టెంబర్ 04. (తరణం బ్యూరో)విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. "ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదు"అని పవన్




వ్యాఖ్యానించారు.సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు.

# తహాశీల్దార్ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను వీ.ఆర్.ఏ లతో భర్తీ చేయాలి

## విఆర్ఏ లపై పెరుగుతున్న పని భారం, రాష్ట్ర వ్యాపిత ఆందోళనకు శ్రీకారం

ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్యఎర్రగుంట్ల, సెప్టెంబర్ 4(తరణం విలేఖరి)రాష్ట్ర వ్యాపితంగా తహాశీల్దార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్ మెన్., రికార్డ్ అసిస్టెంట్, మొదలగు పోస్టులను అర్హులైన వీఆర్ఏ లతో భర్తీ చేసి విఆర్ఏ లపై పని భారం పడకుండా చెయ్యాలని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య అన్నారు.. బుధవారం ఎర్రగుంట్ల లోని మార్క్స్ భవన్లో ఆయన జిల్లా అధ్యక్షులు కోడూరు పుల్లయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు సి మణికుమార్ లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని అన్నింటిని అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులు వీఆర్ఏలతో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల కొంతమంది తాసిల్దార్ లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఏలకు పగలు మరియు రాత్రిపూట విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని ఆయన ధ్వజమెత్తారు. మండలాల పరిధిలోని కార్యాలయంలో ఏ ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయో వాటి వివరాలను సీ సీ ఎల్ ఏ కార్యాలయమునకు



పంపాలని ఇదివరకే ఆదేశాలు ఇవ్వటం అందరికీ తెలిసిందే. తాము ఇదివరకే ఈ సమస్య పైన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని.... అయినా జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం వీటిపై ఇంకా దృష్టి పెట్టకపోవడం అన్యాయం అన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కాళీ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాల పైన త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు

# మేలైన వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేయడం కోసమే పొలంబడి.

## జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్.



మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మేలైన వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేయడం కోసమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. బుధవారం మదనపల్లి మండలం కోళ్ల బైలు గ్రామం మేకల వారి పల్లి లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పొలంబడి ద్వారా మేలైన వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. మెరుగైన వ్యవసాయ పద్ధతులు ద్వారా పండించిన వేరుశనగ పంటను ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ చేయించడం జరుగుతుందని, ఈ సర్టిఫికేషన్ పొందిన పంటకు అధిక ధర చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఈ పంటను మదనపల్లిలో మర్యాద రామన్న పట్నం ఎఫ్ పి ఓ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. కావున రైతులందరు కూడా వ్యవసాయ శాఖ ద్వారా మెరుగైన వ్యవసాయ పద్ధతులను తెలుసుకొని పాటించి మేలైన దిగుబడుల ను సాధించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్, జిల్లా టెక్నికల్ ఏవోలు వెంకట మోహన్, రమేష్ రాజు, మదనపల్లి రైతు సేవా కేంద్రం సిబ్బంది, మదనపల్లి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, మర్యాద రామన్న పట్నం అమరేంద్ర మరియు రైతులు పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం, ఆత్మరక్షణ విద్య బోధనలో ప్రత్యేకం డాక్టర్ ఏ.ఆర్.సురేష్.

## కొనియాడిన ప్రముఖులు. తిరుపతి వేదికగా ఉపాధ్యాయ దినోత్సవం లో శ్రేష్ఠ గురు విశిష్ట పురస్కారం.

మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :నేటి సమాజంలో ఆడ బిడ్డలపైన జరుగుతున్న అవమాన ఘటనల నుంచి ఆడబిడ్డలు రక్షించుకోవ దానికి ఆత్మరక్షణ విద్య ఒక్కటే శరణ్యం అంటూ ఉచిత ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇస్తూ, తనకు ఉన్నతంలో పేదలకు సేవా చేయడంలో పలువురి మన్ననలు పొందిన గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఏ.ఆర్.సురేష్ ఎన్నో ఉత్తమ పురస్కారాలకు అర్హుడని పలువురు కొనియాడారు. తిరుపతి వేదికగా రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.జి. రామమూర్తి, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసా బేగం సంయుక్త ఆధ్వర్యంలో మేక్ మై బేబి జీనియస్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉత్తమ గురువులకు శ్రేష్ఠ విశిష్ట పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఆర్.సురేష్ చేసిన సేవలకు తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య చేతులమీదుగా శ్రేష్ఠ విశిష్ట గురు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. వేలాదిమందికి ఆత్మరక్షణ విద్యలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం, మహిళ పోలీసులు, వార్డు, గ్రామ సచివాలయ పోలీసులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం, కరోన



సమయంలో చేసిన సేవ కార్యక్రమాలలో డాక్టర్ ఏ.ఆర్.సురేష్ చేసిన సేవలను కొనియాడుతూ తిరుపతి మండల విద్యాధికారి కె. బాలాజీ, చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంగరాజు భాస్కర్ రాజు, దర్శకుడు, మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ కొక్కంటి ఈశ్వరయ్య,వప్రసన్న భారతి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్, జి.వీర శంకర్, డాక్టర్.డి.సి. నారాయణ స్వామి, సి.వి.గణేష్ రెడ్డి లు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి.

## మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రజలు మొగ్గుచూపాలి. డిఎస్పీ కొండయ్య నాయుడు వెల్లడి.



మదనపల్లె సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) : మట్టి వినాయకులను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మదనపల్లె డిఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు తెలిపారు. స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు పీస్ కమిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినాయకుడి మట్టి ప్రతిమలని పూజించి, పర్యావరణాన్ని కాపాడు కోవాలని కోరారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని, మండపాల నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని, వివాదాస్పద స్థలాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ వినాయక విగ్రహాలు ప్రతిష్టించకూడదని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, బలవంతపు విరాళాలు మరియు చందాలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు.ఎవరైనా నిబంధనలకు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.భక్తి భావంతో,సాంప్రదాయ బద్ధంగా ప్రతి ఒక్కరూ పండగ జరుపుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు వినియోగించరాదని అదే విధంగా అసభ్యకరమైన అశ్లీల నృత్యాలు ప్రదర్శించ కూడదన్నారు.ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐలు చాంద్ బాషా, రామచంద్ర, రమేష్, కళా వెంకట్రమణ, విజయభారతి సంస్థల అధినేత సేతు, పీస్ కమిటీ సభ్యులు బాలాజీ, ఆనంద్ మరియు ప్రముఖ దేవాలయాల ప్రధాన అర్చకులు, ధర్మకర్తలు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.

## విజ్ఞానాన్ని పంచే గురువులకు ఘన సన్మానం. భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే. డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి.

మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులేనని ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి అన్నారు. బుధవారం స్థానిక నీరు గట్టు వారి పల్లె లో గల సాయి విద్యానికేన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ముందుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి ఆధ్వర్యంలో, సాయి విద్యానికేతన్ కరెస్పాండెంట్ మోడెం శ్రీనివాస రావు అధ్యక్షతన, ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి మాట్లాడుతూ, అజ్ఞానాన్ని తొలగిస్తూ, విజ్ఞానాన్ని పంచే గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రతి విద్యార్థి విద్య నేర్పిన గురువులను జీవిత కాలం గుర్తుంచుకొని, గౌరవించుకోవాలని పిలుపు నిచ్చారు. గురువులు తమ పిల్లలను పక్కన పెట్టి, విద్యార్థులనే తమ సొంత పిల్లలుగా భావిస్తు, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం వారి జీవితాలను ధారపోస్తారన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృషన్ జయంతిని పురస్కరించుకొని, నివాళులు అర్పిస్తూ, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావాలని, ఆకాంక్షించారు. కరస్పాండెంట్ మోడెం శ్రీనివాస రావు మాట్లాడుతూ, సమాజంలో తల్లితండ్రులు తర్వాత పిల్లలపైన ప్రభావితం చూపేది ఉ పాధ్యాయులే నన్నారు. చదువు నేర్పే ఉపాధ్యాయులను ప్రతి విద్యార్థి గౌరవించడం నేర్చుకోవాలని, సూచించారు. ప్రతి విద్యార్థి జీవితానికి ఒక ఉపాధ్యాయుడు మార్గదర్శకంగా ఉంటారని, కావున విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ఉజ్వల







భవిష్యత్తును అందు కోవడమే ఉపాధ్యాయుల కు ఇచ్చే గౌరవమని, పేర్కొన్నారు. అనంతరం ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ మోడెం శ్రీనివాస రావును మరియు పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులను దుశ్శాలువ మరియు స్వీట్ బాక్స్ లు అందించి, గౌరవంగా సన్మానించారు. దీనిపై కరస్పాండెంట్ మోడెం శ్రీనివాస రావు స్పందిస్తూ, ఏ బి సి ఫౌండేషన్ అధ్యక్షులు అప్పనపల్లి భాస్కరాచారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ యం రెడ్డెప్ప, ఉపాధ్యాయులు లక్ష్మి,నౌజియా, చాముండి, శ్రీదేవి, ప్రవళిక, పుష్ప, హైమావతి, మంజుల, లలిత, మూర్తి, బిలాల్ తో పాటు ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ వైకామ్ నదియాదేవి



రాజంపేట/ నందలూరు. సెప్టెంబర్. 4 (తరణం ప్రతినిధి)నందలూరు మండలం ఆడుపూరు వద్ద ఉన్నటువంటి ప్రభుత్వ గురుకుల పాఠశాలను రాజంపేట సబ్ కలెక్టర్ వై కోమ్ నైదియా దేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నివసిస్తున్న గదులను వంటశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ఇక్కడ భోజనం ఎలా ఉందని, వసతులు ఎలా ఉన్నాయని, మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు తాగునీరు సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా అంటూ ఆరా తీశారు. విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులు గాని ఇంకెవరైనా కానీ అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి కన్న ఊరికి తల్లిదండ్రులకు చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# ఆందోళన బాటలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

ఏలూరు సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి)గత ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సేల్స్ మెన్లు,సూపర్వైజర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని ఉంగుటూరు మండల ఉద్యోగులు వెల్లడించారు. ఈ మేరకు ఏలూరులో మద్యం డిపో మేనేజర్ దేవదత్తుకు మంగళవారం సాయంత్రం సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు.అక్టోబర్ 1 నుంచి ప్రయివేట్ మద్యం దుకాణాలను నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని తీసుకువచ్చే నెపంతో ఇంతకాలం పనిచేసిన తమకు ఉద్యోగ,ఆర్థిక భద్రతలు కల్పించిన తరువాతే కొత్త మద్యం విధానం వైపు వెళ్లాలని,అప్పటివరకు తమ ఆందోళన,దీక్షలు కొనసాగిస్తామని ఉంగుటూరు మండల నాయకులు మూల సురేష్, రావి రాజేష్ వెల్లడించారు. ఏపీ రాష్ట్ర బేవరీస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్



అసోసియేషన్ పిలుపు మేరకు 7న మద్యం దుకాణాలను మూసేసి బంద్ పాటిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సాయి,శ్రీను, దుర్గారావుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలి.

## -ఆర్జేడి కి యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి.



కడప సెప్టెంబర్ 4 (తరణం విలేకరి)ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని నలుగురు ప్రధానోపాధ్యాయులకు విధించిన ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం కడపలోని పాఠశాల విద్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో ఆర్జేడి కె.శామ్యూల్ ను కలిసి ఇంక్రిమెంట్ల రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదని కారణంగా ఖాజీపేట మండలం, సి.కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయురాలు సి.గాయత్రి భాయి, పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సావిత్రి దేవి, పులివెందుల రమణప్ప సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర రావు, వేంపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.నారాయణమ్మ లకు రెండు ఇంక్రిమెంట్లు శాశ్వతంగా రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఇంక్రిమెంట్ల కోతకు గురైన ప్రధానోపాధ్యాయులు అనారోగ్య కారణంగా విధులకు హాజరు కాలేకపోయారే తప్ప విధుల పట్ల నిర్లక్ష్యం ఎంత మాత్రం కాదన్నారు. ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా రెండు ఇంక్రిమెంట్ల ను శాశ్వతంగా రద్దు చేస్తూ తీవ్ర అభియోగాలకు విధించే శిక్షను విధించడం తగదన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి నలుగురు ప్రధానోపాధ్యాయులకు ఇంక్రిమెంట్లో కోత విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అలాగే పాఠశాల విద్య పూర్వ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కడప జిల్లా పర్యటన సందర్భంగా చిన్న చిన్న కారణాలతో వల్లూరు మండలవిద్యాశాఖాధికారి లిల్లెమ్మ, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు డేవిడ్ కు నిలుపుదల చేసిన ఇంక్రిమెంట్లను సైతం పునరుద్ధరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై.రవి కుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థినీలను పట్టించుకోని మాధవి లతను కలెక్టర్ తక్షణమే సస్పెండ్ చేయాలి

## పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




లక్కిరెడ్డిపల్లి, సెప్టెంబర్ 4 తరణం విలేఖరిమండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు రక్షణ కరువై భయం భ్రాంతులు వున్నా తరుణంలో విద్యార్థినీల తల్లిదండ్రులు తమకు చదువు కన్నా తమ యొక్క బిడ్డల సంరక్షణ ముఖ్యమని ఇళ్లకు తీసుకు వెళుతున్న కూడా గురుకుల పాఠశాలల అధికారులు విద్యార్థినీలకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం లక్కీరెడ్డిపల్లె మండలం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థీనీలను లైంగిక వేధించి అత్యాచారానికి పాల్పడిన ప్రిన్సిపాల్ భర్త పై కేసు నమోదు చేసినప్పటికీ విద్యార్థినిలకు రక్షణ కల్పించడంలో గురుకుల అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని వారు ఆరోపించారు. తల్లిదండ్రులకు భరోసా ఇవ్వలేని పరిస్థితిలో గురుకుల అధికారులు ఉండడం చాలా సిగ్గుచేటని ఆయన ధ్వజం ఎత్తారు. ఇంత జరుగుతున్నా కూడా అంబేద్కర్ గురుకుల పాఠశాల సమన్వయకర్త డిసిఓ మాధవిలత పర్యవేక్షణ లేకపోవడంతో చాలా శోచనీయమన్నారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ స్పందించి డిసిఓ మాధవి లతను తక్షణమే సస్పెండ్ చేసి విద్యార్థినిలకు భరోసా ఇచ్చే అధికారులు నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడల పిడిఎస్ యు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగాఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

# మహమ్మద్ ఖాన్ ఉత్తమ సేవలకు శ్రేష్ట గురు పురస్కారం.



మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) విద్యా రంగం లో వివిధ విభాగాల్లో అందించిన సేవలకు గుర్తింపు గా మహమ్మద్ ఖాన్ కు శ్రేష్ట గురు పురస్కారాన్ని అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి లోని మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ నందు రేవతి ఫౌండేషన్, వీ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఉప విద్యాధికారి బాలాజి మాట్లాడుతూ ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని అన్నారు. విద్యా రంగానికి సేవలను అందించిన వారిని సత్కరించడం సంతోషదాయకమన్నారు.అనంతరం మహమ్మద్ ఖాన్ కు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు.

# ఉపాధ్యాయులే భావి భారత దేశ నిర్మాతలు

## సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం



కడప, సెప్టెంబర్ 4 (తరణం విలేకరి)ప్రతి సెప్టెంబర్ 5వ తేదీన మన జీవితాల్లో వెలుగులు నింపుతున్న స్మరించు కుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా పాధ్యాయుల దినోత్స వంగా జరుపుకుంటున్నాము. అజ్ఞానమనే ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు ఉపాధ్యాయులు. గురువు అనుగ్రహం కలిగిన నాడు అజ్ఞాని జ్ఞానవంతుడు అవుతాడు. భారతదేశం లో సెప్టెంబరు 5 న దినోత్సవం జరుపుకోవడానికి ప్రధాన కారణం సర్వేపల్లి రాధాకృష్ణ. 1962 వ సంవత్సరం నుండి సెప్టెంబర్ 5వ తేదీన ప్రతి ఏడాది దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఆరోజు మనకు విద్యా బోధన గురువులను స్మరించుకుంటాము. మన భవిష్యత్తుకు బంగారు వేసిన, మనం ఉన్నతంగా ఎదగడానికి తోడ్పాటు నందించిన గురువులను గుర్తు చేసుకొంటూ వారిని పూజిస్తాము. గురుబ్రహ్మ గురువిష్ణు మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అంటూ స్మరించు కుంటాము. విద్యాలయాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహించుకుంటారు. తమిళనాడులోని తిరుత్తణిలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పని చేశారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీ మాస్టర్ డిగ్రీ అందుకున్నారు. కలకత్తా, మైసూర్ యూనివర్సిటీ లలో లెక్చరర్ గా పనిచేశారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. వృత్తిలో కొనసాగిన ఆయన విద్యార్థులు ఎవరైనా పుట్టినరోజు వేడుకలు స్తామని ఆయనని అడిగితే వద్దని సున్నితంగా తిరస్కరించే వారు. అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలనే వారు. అందుకే ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే జరుపుతున్నారు. అది అప్పటి నుండి ఇప్పటి వరకు ఆనవాయితీగా సర్వేపల్లి రాధాకృష్ణన్ 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతి కి, 11 నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థులకు ఒక పండుగ రోజు: గురువులకు గురుతరమైన బాధ్యతనుఅందరూ గురువులకే గురువుగా భావించేవారు. సర్వేపల్లి తనకు కృష్ణుడితో గుర్తు చేసే రోజు. గొప్ప గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు.ఏటా సమానమని జాతిపిత టీచర్లను మహాత్మాగాంధీ కీర్తించారు. ఉ యుగ పురుషుల గు రించి ఉ చీకటి లో పన్యాసం ఇవ్వండి అని పిలిస్తే నింపే వారే యుగపురుషుడే వచ్చారు అని కూడా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉద్దేశించి ఉపాధ్యాయ కీర్తించారు హెరీవెల్. నాలో మామూలు మనిషిని దర్శించిన ఉపాధ్యాయ మహర్షి అంటూ సోవియట్ చేసిన అది నేత స్టాలిన్ ఆయన బాటలు గొప్పతనాన్ని చెప్పారు.మీరు నా కృష్ణుడు నేను మీ అర్జునుడిని గురుదేవో అని గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడుగా కీర్తించబడ్డారు. గురువులను అన్నిటికంటే ఆయన గొప్ప ఉపాధ్యాయుడు. ఎంతోమంది విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దిన గొప్ప గురువు. ప్రతి ఒక్కరూ ఆయనలాగా విద్యార్థు జన్మించిన లు ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే, ఆయనను స్మరిస్తూ, ఆయన రెండవ మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును ఉ లో పాధ్యాయ దినోత్సవంగా జరపాలని నిర్ణయం తీసుకుంది కేంద్రం. పండిట్ ఆయన జవహర్ లాల్ నెహ్రూ తీసుకున్న ఈ నిర్ణయానికి సర్వేపల్లి గొప్పతనమే కార ఉపాధ్యాయ ణం. ఏ రంగంలో అయినా, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎవరైనా నిర్వహి సరే ఉపాధ్యాయుల వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న వారే. గురువులు విద్యార్థులు అందించిన విజ్ఞానంతో, సంస్కార సౌజన్యాలతో పైకి ఎదిగిన వారే. పిల్లల పట్ల బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయుడిదే కీలకపాత్ర. ఇంతటి మహత్తర కార్యాన్ని నిర్వర్తించే గురువు కలకాలం తలెత్తుకు జీవిం వేడుకలను చవచ్చు. ఇంత గొప్ప గొప్ప అవకాశం మరెవ్వరికీ దక్కదని రవీంద్రనాథ్ వస్తుంది. ఠాగూర్ వంటి మహానుభావులు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి అంత గొప్పది. సార్లు ఉపాధ్యాయులు అంతటి గొప్పవారు. కాబట్టి ఉపాధ్యాయుల దినోత్సవము విద్యార్థులకు ఒక పండుగ రోజు గురువులకు గురుతరమైన బాధ్యతను గుర్తుచేసే రోజు

# నరసన్న పల్లె గ్రామంలో మురికి నీటిని తొలగించండి

## - బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రకాంతం ఈశ్వరయ్య



బ్రహ్మంగారి మఠం, సెప్టెంబర్ 04(తరణం విలేఖరి) : మండల పరిధిలోని నరసన్న పల్లె గ్రామంలో మురికి నీరంతా ఇళ్లల్లోకి రావడంతో, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్ల మీదికి రావడం, వీధికి మురికి నీరంతా ఇళ్ల ముందర నిలబడడంతో వాహనాలు కూడా రాకపోకలతో మరింత తీవ్ర ఇబ్బందులు గురై, ఆపరిశుభ్రంగా కాలనీ అంతా మారడం, పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇళ్లకే పరిమితమైయ్యారని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రకాంతం ఈశ్వరయ్య అన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం, గ్రామస్తులు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోకపోవడం లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అదే గ్రామానికి చెందిన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంతం ఈశ్వరయ్య కూడా పత్రికలో ప్రకటనలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా హామీలు చెప్పడమే తప్ప, పని చేసింది ఏమీ లేదన్నారు. ఈ మురికి నీరుతో దోమల వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్యాధికారులు కూడా ఈ గ్రామం వైపు చూడక పోవడం శోచనీయమన్నారు. బి.సి. కాలనీలో ఉదయం పొలం పనులకు పెద్దల సైతం వెళ్లిపోతే, పిల్లలు పాఠశాలకు వెళ్ళలేక పోవడం, తల్లిదండ్రులు వచ్చేంత వరకు ఇళ్ళకే పరిమితమైయ్యారని అన్నారు. వృద్ధులు మాత్రం వీధులోనికి రావాలన్న రాలేకపోవడం, గతంలో కూడా కొంతమంది వృద్ధులు కిందపడి కాళ్లు, చేతులు విరిగి హాస్పిటల్ పాలైయ్యారని, ఇప్పటికైనా అధికారులు ఈ గ్రామాలలో డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేసి, మురికి నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# స్వర్గీయఉమేష్ చంద్ర స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి

## దివంగత అధికారికి ఘనంగా నివాళి

## ఎస్ .పి.వి.హర్షవర్ధన్ రాజు,


చదలవాడ ఉమేశ్ చంద్ర (1966 మార్చి 29- 1999 సెప్టెంబరు 4) ఆంధ్రప్రదేశ్ కి చెందిన పోలీస్ ఉన్నతోద్యోగి. కడప జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గా శాంతిభద్రతలు నెలకొల్పి "కడప పులి" అనే పేరు తెచ్చుకున్నాడు.

చదలవాడ ఉమేశ్ చంద్ర

చదలవాడ ఉమేశ్ చంద్ర

| | |
|---|---|
| జననం | చదలవాడ ఉమేశ్ చంద్ర<br>మార్చి 29, 1966<br>గుంటూరు జిల్లా పెదపూడి |
| మరణం | సెప్టెంబరు 4, 1999 |

కడప, సెప్టెంబర్ 4 (తరణం క్రైమ్ రిపోర్టర్) విధుల పట్ల స్వర్గీయ ఉమేష్ చంద్ర క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం, నిజాయితీ ని స్ఫూర్తిగా తీసుకుని పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు పేర్కొ న్నారు. బుధవారం ఉమేష్ చంద్ర వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ ఉమేష్ చంద్ర 1966 సం. మార్చి 29న గుంటూరు జిల్లా పెదపూడిలో చదలవాడ వేణుగోపాలరావు, నయనతార దంపతులకు జన్మించారని, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ లలో గోల్డ్ మెడల్ అందుకుని, 1991లో ఐ.పి.ఎస్కు ఎంపికయ్యారన్నారు. కడప జిల్లాలో 1994లో ఏ.ఎస్.పిగా, 1995లో ఎస్.పిగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారన్నారు. 'జన జాగృతి' పేరుతో ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్ ను అమలుచేసి పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆద్యుడు ఉమేష్ చంద్ర అని పేర్కొన్నారు. చదలవాడ ఉమేశ్ చంద్ర సెప్టెంబరు 4, 1999 న మరణించారని జిల్లా ఎస్.పి తెలిపారు. ఉమేష్ చంద్ర భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాల సాధనకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు.

# వరద బాధితుల సహాయార్థం వేమిరెడ్డి దంపతుల భూరి విరాళం

## వరద బాధితులను ఆదుకునేందుకురూ. కోటి విరాళం అందజేత

## విజయవాడలో సీఎం చంద్రబాబు కు చెక్కు అందించిన వేమిరెడ్డి దంపతులు



నెల్లూరు సెప్టెంబర్ 4(తరణం బ్యూరో )నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు భూరి విరాళం అందించారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన వారికి సహాయ సహకారాలు అందించేందుకు, వారిని ఆదుకునేందుకు కోటి రూపాయలను విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి కోటి రూపాయల చెక్కును అందించారు. ఇటీవల వచ్చిన వరదలతో విజయవాడ తీవ్రంగా నష్టపోయింది. వేలాదిమంది ప్రజలు తిండీ, నీరు లేక అల్లాడిపోయారు. ఇప్పటికీ పలు కాలనీలు జల దిగ్బంధంలో ఉండిపోయాయి. సీఎం చంద్రబాబు ఇప్పటికే దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అన్నార్తులు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదలతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డ ప్రజల సహాయార్థం, వారి బాగోగుల కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కోటి రూపాయలను విరాళంగా అందించి మానవత్వం చాటుకున్నారు. విపత్తు నుంచి ప్రజలు త్వరగా బయటపడాలని ఆయన ఆకాంక్షించారు. రూ. కోటి రూపాయలు అందించిన వేమిరెడ్డి దంపతులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు , నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

05.09_Thur-Tharanam 1-8.qxd 9/4/2024 8:22 PM Page 4



# వరద బాధితులను మానవత్వం తో ఆదుకుందాం.

## తనవంతుగా రూ.2 లక్షల ఆర్థిక సాయం.
## మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా.



మదనపల్లె సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఉదారంగా ఆదుకుందామని, తన వంతు సాయంగా రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన అతి భారీ వర్షాలు ఏపీపై పెనుప్రభావం చూపాయన్నారు.కోస్తాలోని జిల్లాల్లో అనేక గ్రామాలు నీట మునిగి,వేలాదిమంది ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉ ఒడిపోయారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ నిరంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు చేపట్టి బాధితులకు భరోసానిస్తు న్నారన్నారు.వారి స్ఫూర్తితో మదనపల్లి నియోజకవర్గం నుండి విరాళాల సేకరించి బాధితులకు అండగా నిలుస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి తగు సలహాలు, సూచనలు ఇచ్చి బాధితులకు అండగా నిలవాలని హితవు పలికారు. వైకాపా పాలనలో ఆయన ఏనాడు తాడేపల్లి ప్యాలెస్ వదిలి రాలేదని, విజయవాడ నగరంలో ఎక్కడా కనీస సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. వైకాపా నాయకుల మితిమీరిన ఆక్రమణల వల్లే ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సబ్ కలెక్టర్ కార్యాలయం ఘటనను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కబ్జాలు ఆక్రమణలు ఎవరు చేశారో అనే దానికి 2024 ఎన్నికల ఫలితాలు నిదర్శనమని ఆయన చెప్పుకొచ్చారు. ఇది విమర్శలు చేసుకునే సమయం కాదని, వరదలతో సర్వం కోల్పోయిన వారికి రాజకీయాలకు అతీతంగా ఆపన్న హస్తం అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ గుర్రప్ప నాయుడు, నవీన్ చౌదరి, నాగూర్ వలి, షంషీర్, యర్రబల్లి వెంకట రమణారెడ్డి, తమ్మిశెట్టి రామకృష్ణ,కంచర్ల మల్లికార్జున నాయుడు, రాటకొండ శ్రీనివాసులు నాయుడు,రామిశెట్టి (కమలామ్రి) కృష్ణ,కత్తి లక్ష్మన్న,జెసిబి వేణు, జెసిబి మధుసూదన్ రెడ్డి,విజయమ్మ,జీవి నాయుడు,బీదం గురునాథ్ యాదవ్,ప్రభాకర్,రెడ్డి రాయల్స్,అన్వర్ బాషా,మడితం రమణ, ఎంపిటీసీ దేవేంద్ర మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరద సహాయం మానేసి, బురద రాజకీయాలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి.

## ముఖ్యమంత్రి చంద్రబాబు పై బురదజల్లడం మానుకోవాలి.
## టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి, గుత్తికొండ త్యాగరాజు.



మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :ముఖ్యమంత్రి చంద్రబాబు రేయింబవళ్ళు స్వయంగా వరద బాధితులకు సహాయ చర్యలను పర్యవేక్షిస్తూ డ్రోన్లు, హెలికాప్టర్ల, వాహనాలు ద్వార వరద ముంపు ప్రాంత బాధితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆహారం, త్రాగు నీరు, పాలు, బ్రెడ్, బిస్కెట్స్ ముఖ్యమంత్రి తో పాటు మంత్రి నారా లోకేష్ మరియు మంత్రి వర్గం దగ్గరుండి సహాయక చర్యలు అందిస్తుంటే వరద బాధితులను ఆదుకోకుండా ముఖ్యమంత్రి, అధికారపక్షం పైన విమర్శలు చేయడం బురద రాజకీయం చేయడం జగన్ కే చెల్లుతుందని టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి, గుత్తికొండ త్యాగరాజు విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ గతంలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్ లో రివ్యూ చేసి రెడ్ కార్పెట్ మీద నడిచి వెళ్లడం తప్పా ఏసహాయం చేయలేదని ఆరోపించారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి బాధితుల ప్రాణాల పోతే నాలుగేళ్లుగా ప్రాజెక్టు వైపు కన్నెత్తి చూడని జగన్ గత ఐదేళ్ల కాలంలో ఏనాడూ కాలవలు, చెరువులు, ప్రాజెక్టుల గురించి పట్టించుకోని వ్యక్తి, వరద బాధితుల కోసం సేవలందిస్తున్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చాంద్ భాషా, మాజీ ఎంపీపీ నర్సింలు, సుధాకర్ నాయుడు, చంద్రప్ప, వెంకటస్వామి, చంద్రశేఖర, రమణప్ప, రవి నాయుడు, వెంకటరమణ, తిరుపాలు, ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# వరద ప్రాంత ప్రజలకు నీ నీ సేవ అపారం.

## వరదసమస్యల నుండి ప్రజలని బయటపడేయటంలో దిట్ట నారా చంద్రబాబు నాయుడు
## నాయకులకుఅధికారులకు చంద్రబాబు మార్గదర్శం..



కమలాపురం, సెప్టెంబర్ 4(తరణం విలేఖరి) విజయవాడ మరియు పరిసర ప్రాంతాలలో వచ్చిన భారీ వరదలతో సమస్యలలో చిక్కుకున్న ప్రజలకు సహాయం అందించేదానికి 74 సంవత్సరాల వయ్యసులో కూడా యువకుడి మాదిరి, నీట మునిగిన కాలనీలలో రాత్రి పగలు అనే తేడా లేకుండా అహర్నిశలు ప్రజల మధ్యనే ఉంటే సహాయక చర్యలను పర్యవేశిస్తూ, పాలు, నీళ్లు, ఆహారం అందిస్తూ, ప్రభుత్వ వ్యవస్థలే కాకుండా, స్వచ్చంద సంస్థలు, విజయవాడ దుర్గమ్మ సన్నిధి ద్వారా ఆహారాన్ని తయారీ చేపిస్తూ ప్రజలకి అందిస్తూ ప్రజలకి సేవ చేస్తుంటే, జగన్ మోహన్ రెడ్డి , వచ్చి విమర్శలు చెయ్యడం విడ్డురంగా వుంది. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు వరదలు, తూఫాన్ వచ్చి సమస్యలతో ఇబ్బంది పడుతుంటే ప్యాలసులో కూర్చొని ఎగ్ పఫ్ లు తింటూ చోద్యం చూస్తూ, గ్రౌండ్ లో పని చెయ్యాల్సిన అధికారులను తన ప్యాలెస్సుకు పిలిపించుకొని మాట్లాడిన వ్యక్తి మరియు హెలికాప్టర్ లో తిరుగుతూ, రెడ్ కార్పెట్ ఏర్పాటు చేయించుకొని ప్రజల వద్దకు వచ్చి చూసి చూడనట్టు వ్యక్తివి నువ్వు. బుడమేరు వాగు పైన ఎటువంటి లిఫ్ట్ గేట్లు లేకపోయినా, గేట్లు ఎత్తడం వల్లనే వరదలు వచ్చాయని విమర్శించడం చూస్తుంటే ఈ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన 5 సంవత్సరాలు ప్యాలెసులో అక్రమంగా ప్రజల సొమ్మును ఎలా దోచెయ్యాలి అనేది మాత్రమే ఆలోచిస్తూ దానిని ఆచరణలో పెట్టాడు తప్పితే, అసలు రాష్ట్రములో ఎన్ని సాగు నీటి ప్రాజెక్టులు వున్నాయి, ఎన్ని వాగులు వున్నాయి అనేది కూడా తెలుసుకోలేక పోయిన నువ్వు , ప్రజల మధ్యన వుంటూ నిద్రాహారాలు మాని పని చేస్తున్న ముఖ్యమంత్రి ని, ప్రజల మధ్యనే ప్రతి ఒక్క మంత్రి వుంటూ సహాయక చర్యలను పరిశీలిస్తుంటే, నారా లోకేష్ టెక్నాలజీని ఉపయోగించుకొని బాధిత ప్రాంతాలను పరిశీలిస్తూ ఎప్పటికి అప్పుడు కేంద్ర, రాష్ట్ర అధికారులతో మాట్లాడుతూ పని చేస్తుంటే, ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి సలహా సూచనలు, ని పార్టీ కార్యకర్తలను, నాయకులను ప్రజల మధ్యకి పంపి వారికీ సహాయం చెయ్యాల్సింది పోయి, ఈ రోజు సిగ్గు లేకుండా వచ్చి నువ్వు విమర్శించడం నీ వ్యక్తిత్వానికి నిదర్శనం అని జిల్లా మైనారిటీ అధ్యక్షులు శ్రీ షేక్ ఖాదర్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవరాజుపల్లి నాగిరెడ్డి జిల్లా బీసీ నాయకులు గండి నారాయణ , నియోజకవర్గ నాయకులు గుజ్జుల నారాయణ , జిల్లా రైతు నాయకులు రమణారెడ్డి , మండల రైతు అధ్యక్షులు రవీంద్రారెడ్డి లేతపల్లి ఎల్లారెడ్డి మరియు నాయకులు పాల్గొన్నారు.

# ఏపీలో బిజెపి స్వశక్తిగా ఎదిగేందుకు కృషి చేయాలి

## సభ్యత్వాల నమోదు ప్రారంభోత్సవంలో
## మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి




రాజంపేట.సెప్టెంబర్. 4 (తరణం ప్రతినిధి)భారతీయ జనతా పార్టీ స్వశక్తిగా ఎదిగేందుకు ప్రతి బిజెపి నాయకులు, కార్యకర్తలు తన వంతుగా సభ్యత్వాలను నమోదు చేయించి 2029 లో భారతీయ జనతా పార్టీని స్వశక్తిగా అధికారంలోకి తీసుకురావాలని భాజపా నాయకులు ,ప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట న్యూ ఆంధ్ర కళ్యాణ మండపంలో అన్నమయ్య జిల్లా భాజపా అధ్యక్షులు సాయి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశ అఖండత సమగ్రత సమైక్యత ధ్యేయంగా చేసుకున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మొదటగా ఇద్దరి సభ్యులతో ఏర్పడి దేశంలో నెంబర్ వన్ స్థానంలో పార్టీ ఏదైనా ఉందంటే అది భాజపా పార్టీని అని తెలిపారు. ఇప్పటివరకు ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఇకనుంచి అలా కాకుండా భారతీయ జనతా పార్టీని స్వశక్తిగా అధికారంలోకి వచ్చేందుకు ప్రతి బిజెపి నాయకుడు కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో బిజెపి నాయకులు కార్యకర్తలు 45 రోజులు పాటు జరిగే సభ్యత్వ కార్యక్రమంలో విరివిగా పాల్గొని రాష్ట్రంలోనే అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మైనార్టీలకు బిజెపి పార్టీ పైన కొన్ని అపోహలు ఉన్నాయని వాటిపై వారికి బిజెపి నాయకులు పూర్తిగా అవగాహన కల్పించి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని తెలిపారు. ఏ విధంగా ఎస్సీ ఎస్టీ లతోపాటు అన్ని వర్గాల వారికి బిజెపి అందిస్తున్న పథకాలపై పార్టీ అభివృద్ధిపై వివరించి సభ్యత్వాలను నమోదు చేయిస్తే దేశంలోనే అతిపెద్ద స్వశక్తి పార్టీగా బిజెపి అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఇప్పటివరకు తాను మైనార్టీల కోసం 20వేల ఇల్లు నిర్మించి ఇచ్చానని తెలిపారు. అంతా బాగానే ఉంది కానీ ఎన్నికల సమయానికి వచ్చేసరికి మైనార్టీలు కానీ, ఎస్సీ ఎస్టీలు కానీ బిజెపి పార్టీకి ఓట్లు వేయడం లేదని అదేమిటో అర్థం కాలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తాను సెల్ లింకు ద్వారా ప్రారంభించి తనకు తెలిసిన వారికి పంపిస్తే ఇప్పటివరకు 200 మంది సభ్యత్వాలు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఇదే విధంగా ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త సభ్యత్వాల మీద దృష్టి సారించి ఎక్కువ మంది యువతి యువకుల చేత సభ్యత్వం చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సురేష్ రాజు, కృష్ణ యాదవ్, కిరణ్ కుమార్, బాలాజీ, చంద్రమౌళి, గోపాల్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు చెందిన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రాజు పాఠశాల విద్యార్థిని శ్రీ పూజ







రాజంపేట.సెప్టెంబర్. 4(తరణం ప్రతినిధి) రాజంపేట పట్టణం రాజు పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని శ్రీ పూజ బుధవారం నెల్లూరు జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. శ్రీ పూజ తండ్రి వెంకటేశ్వర్లు చిట్వేలి, రాజంపేట మండలంలో ని కూచివారిపల్లి, పెద్దకారంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. అనంతరం పదోన్నతుపై రాజంపేట డిఎల్పిఓగా అట్లూరు, పుల్లంపేట ఎంపీడీవో గా పనిచేశారు. సుదీర్ఘకాలం రాజంపేట ప్రాంతంలో ఆయన ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. దీంతో తన కుమార్తె శ్రీ పూజను ప్రస్తుతం అన్నమయ్య జిల్లా టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజుకు చెందిన రాజంపేట రాజు పాఠశాలలో పదవ తరగతి వరకు చదివించారు. ఆసమయంలో శ్రీ పూజ మంచి మార్కులు సాధించి పాఠశాల ప్రధమ స్థానంలో నిలిచారు. తర్వాత ఇంటర్మీడియట్, బీటెక్ కు పూర్తి చేసి సివిల్స్ కు ప్రిపేర్ అయ్యి ఐఏఎస్ కు ఎంపికయ్యారు. ఐఏఎస్ కి ఎంపికైన సమయంలో శ్రీ పూజకు రాజంపేట వాసులు ఉద్యోగులు ప్రత్యేక అభినందన సభ నిర్వహించి అభినందించారు. తర్వాత ఆమె ట్రైనింగ్ కు వెళ్ళింది. ట్రైనింగ్ పూర్తి కావడంతో ప్రస్తుతం మొదటి పోస్టుగా నెల్లూరు జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్గా నియమించారు. అక్కడ కలెక్టర్ గా పని చేస్తున్నటువంటి నందలూరు మండలానికి చెందిన గొబ్బిళ్ళ విద్యా దారి పదోన్నతపై చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గా బదిలీ కావడంతో ఆమె చిత్తూరు జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. దీంతో శ్రీ పూజను కందుకూరు సబ్ కలెక్టర్ గా నియమితులు కావడంతో తల్లిదండ్రులతో కలిసి కందుకూరుకు చేరుకొని సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నెల్లూరు కలెక్టర్ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీ పూజను కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఇతర అధికారులు కలిసి పుష్పగుచ్చాలని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నందలూరుకు చెందిన గొబ్బిళ్ళ విద్యాధరి జాయింట్ కలెక్టర్ గా, రాజంపేట పట్టణం రాజు పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీ పూజ కందుకూరు సబ్ కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించడంతో రాజంపేట నందలూరు వాసులతో పాటు రాజంపేట రాజు పాఠశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్సై చిరంజీవిని సత్కరించిన గోశాల నరసింహ స్వామి

సిద్ధవటం సెప్టెంబర్ 04(తరణం విలేఖరి) మోదిన్ సాహెబ్ పల్లె గ్రామానికి చెందిన గోశాల వ్యవస్థాపకుడు రేవూరి వెంకట నరసింహ స్వామి బుధవారం సిద్ధవటం ఎస్సై చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్ఐకి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గోమాత విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు



05.09_Thur-Tharanam 1-8.qxd 9/4/2024 8:22 PM Page 5



# ఎర్రవల్లి బాలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినజిన్నారం మాజీ ఎంపీపీ..రవీందర్ గౌడ్



పఠాన్ చేరు, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):పఠాన్ చేరు నియోజకవర్గంలోనీ జిన్నారం మండలం జిన్నారం గ్రామంలో ఎర్రవల్లి బాలయ్య భార్య ఎర్రవల్లి అనసూయ ఇటీవల గుండె నొప్పితో మృతి చెందడంతో, ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్ళరా మానవత్వంతో ఆ కుటుంబానికి తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పల్నాటి భాస్కర్, కోరబోయిన నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, విష్ణుమూర్తి చారి, రొయ్యపల్లి రవి, ఎర్రవల్లి బాలు, కలిసి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసారు.

# హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలుకే హెచ్చరించిన..కమిషనర్ రంగనాథ్

### అమీన్ పూర్ లో ఓ వ్యక్తి అరెస్ట్



పఠాన్ చేరు, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):పఠాన్ చేరు నియోజకవర్గంలోనీ అమీన్ పూర్ లో హైడ్రా పేరుతో ఎవరైనా బెదిరింపులు, వసూళ్లకు పాల్పడితే అలాంటి వారిని జైలుకు పంపుతామని కమిషనర్ రంగనాథ్ హెచ్చ రించారు. సామాజిక కార్యకర్తల ముసుగులో బిల్డర్లను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, హైడ్రా విభా గంలోని ఉన్నతాధికారులతో తమకు పరి చయాలున్నాయం టూ బెదిరింపులకు పాల్పడు తున్నట్లు తెలిసిందన్నారు. అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఎవరైనా అలాంటి బెది రింపులకు పాల్పడితే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. అమీన్ పూర్ లో హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న విప్లవ్ సిన్హా అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రంగనాథ్ వెల్లడించారు.

# జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి హైకోర్టు నోటీసులు

### భూగర్భ గనులు, పర్యావరణ, పురపాలకశాఖల అధికారులకు సైతం జూబ్లీహిల్స్ పేలుళ్లపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమెతో పాటు భూగర్భ గనులు, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శులకు కూడా నోటీసులు పంపింది. హైదరాబాద్, జూబ్లీహిల్స్ నివాసప్రాంతాల్లో కొండరాళ్లను తొలగించేందుకు రాత్రింబవులు పేలుళ్లు జరుపుతున్నారు. దీనిపై వార్తాపత్రికలలో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో ఈ కథనాలపై స్పందించిన హైకోర్టు జడ్జి జస్టిస్ నగేశ్ భీమపాక సీజేకు లేఖ రాశారు. పేలుళ్లతో రాత్రిపూట పెద్దపెద్ద శబ్దాలు వస్తున్నాయని, సమీప ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వాజ్యం(పిల్)గా స్వీకరించింది. ఇవాళ ఈ పిల్పై విచారణ జరిపిన న్యాయస్థానం భూగర్భ గనులు, పర్యావరణ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శులతో పాటు, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ఎంజీ కమిషనర్లను ప్రతివాదులుగా చేర్చింది. పేలుళ్లపై వివరణ ఇవ్వాలని ఐఏఎస్ ఆమ్రపాలితో పాటు వారికి నోటీసులు ఇచ్చింది.

# భారీ వర్షాల వలన నష్టపోయిన బాధితులకు వెంటనే ఆదుకోవాలనిజోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి వినతి.

### .బేరి రామచందర్ యాదవ్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బిసి ఫెడరేషన్ అధ్యక్షులు, ఆర్కే సాయన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కు ప్రకృతి విపత్తు భారీ వర్షాల ఉగ్రరూపంతో వర్షం వరద బీభత్సం గురించి వినతి పత్రం తెలంగాణ రాష్ట్రం హైదరాబా ద్ తో సహ అన్ని జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రోడ్లు కాలనీలో గృహాలు మునిగిపో యి లోతట్టు ప్రాంతాల్లోని పేద, బస్తీ ప్రజలుఅందరూ నిరాశ్రులై వెంట వెంటనే వర్షాలు రావడం నదులు వాగులు వంకలు కాలువలు ఏరులై పారటం జల దిగ్బంధం లోతట్టు ప్రాంతాలు కాలనీలు మునిగి ప్రజలు అష్ట కష్టాల పాలవటం మనందరికీ తెలుసు మూడు రోజుల వర్ష బీభత్సం సృష్టించాయి. నెల రోజుల నుండి వైరస్ జ్వరాలు పీడిస్తున్న సమయంలో ఈ భారీ వర్షాలు రావడం ప్రకృతి బీభత్సం జరిగి అపార నష్టం కోట్లలో జరిగింది. నీట మునిగిన కాలనీల వాళ్లకు ప్రత్యక్షంగా సహాయం చేసి నిరాశ్రయులైన వారికి ఫంక్షన్ హాల్స్ లో ఆశ్రయం కల్పించి ఆహార పొట్లాలు నీళ్లు వసతి కల్పించాలని ప్రజానీకం తరఫున కోరుకుంటున్నాం.ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్, జి నరసింహ, శ్యాం కుమార్, తదితరుల పాల్గొన్నారు.




# జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా

### మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి
### మా సొసైటీకి స్థలం ఇవ్వాలని గ్రేటర్ సొసైటీ విజ్ఞప్తి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):హైదరాబాద్‌రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా తాను కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే పలు మార్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి చర్చించడం జరిగిరని, త్వరలో కొత్త పాలసీ ద్వారా అర్హులైన జర్నలిస్టు లందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని చెప్పారు.గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ ల మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తో పాటు పలువురు సొసైటీ ప్రతినిధులు మీడియా అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య చర్చించారు. ఈ సందర్భంగా గ్రేటర్ జర్నలిస్ట్ ల హౌసింగ్ సొసైటీ గురించి ఆయన అడిగి తెలుసు కున్నారు. తమ సొసైటీ 2008 లో ఏర్పడిందని, అప్పటి నుంచి మూడు దఫాలుగా జర్నలిస్టుల నుంచి సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో 1300 మంది సభ్యులున్నారని గ్రేటర్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ పత్రికలు, ఛానెళ్ళలో పని చేస్తున్న చాలా మంది సీనియర్ జర్నలిస్టులు చాలా ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇరవై ముప్పై ఏళ్ల సర్వీస్ ఉన్న చాలా మంది జర్నలిస్టులు ఇటు యాజమాన్యాల నుంచి గానీ, అటు ప్రభుత్వాల నుంచి గానీ ఇండ్ల జాగలు పొందకుండా నిరాశగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలన్న ఆలో చన ప్రభుత్వానికి ఉందని, అయతే ఏ విధంగా ఇవ్వాలన్న విషయంలో కసరత్తు చేయాల్సి ఉన్నందున దీనికి కొంత సమయం పడుతుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ ల హౌసింగ్ సొసైటీ ఉన్న 1300మంది జర్నలిస్టుల అర్హత, సీనియారిటీ ప్రకారం లిస్టు సమర్పించాలని కోరారు. అనంతరం సొసైటీ నాయకులు ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు యర్రమిల్లి రామారావు, కరుణాకర్, అంజిరెడ్డి, నాగవాణి, టి. శాంతి, తదితరులు పాల్గొన్నారు.



# సంచార పుస్తక వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సెప్టెంబర్ 4(తరణం బ్యూరో )బాల సాహిత్య పుస్తకాల వలన విద్యార్థుల్లో పుస్తకపఠనాసక్తి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.మంగళవారం సాయంత్రం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంచార పుస్తక వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. సంచార వాహనంలో చదవడానికి అందుబాటులో ఉ ంచిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఈ వాహనం పాఠశాలలు, అంగన్వాడీలు, గ్రామాలలోని ముఖ్య కూడళ్ల వద్ద పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, విద్యానైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. విద్యార్థుల పుస్తక పఠన సామర్థ్యం పెంచడానికి కృషి చేస్తున్న రూమ్ టూ రీడ్ సంస్థను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఆర్వో భుజంగ్ రావ్, డిఈఓ రవీందర్ రెడ్డి, రూమ్ టు రీడ్ జిల్లా ఇంచార్జి రవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ నిర్మాణంలో భాగమవ్వండి..

### కార్పొరేటర్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలో రాయదుర్గం లో గల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వ నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం అన్ని రంగాల్లో సమూల మార్పులతో ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. దేశ అభివృద్ధికి మీ వంతు కృషిని అందించేందుకు, బిజెపిలో సభ్యత్వం పొందండి, దేశ ప్రగతిలో భాగస్వామ్యం అవ్వండి అన్ని అన్నారు. సభ్యత్వ నమోదుకు తక్కువ రోజులు ఉన్నందున వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకులు, స్థానిక నేతలు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షాల వరదల్లో మునిగిపోయిన వైకుంఠధామం

ఖానాపూర్ 4(తరణం బ్యూరో ) గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వరదలకు ఖానాపూర్ పట్టణంలోని గోదావరి తీరాన గల వైకుంఠధామం మునిగిపోయింది లక్షలాది రూపాయలతో గోదావరి నది తీరంలో నిర్మించిన వైకుంఠధామం అధిక వర్షాలు వచ్చినప్పుడల్లా ఇలా మునిగిపోవడం పరిపాటి అయిపోయింది పాలకుల ముందచూపులేని కారణంగా గోదావరి నానుకొని కట్టిన వైకుంఠధామం ఇలా ప్రతి వర్షాకాలం స్వర్గ ప్రాప్తి పొందిన ప్రజలకు త్రివ్ర అసౌకర్యంగా మారింది. ఇప్పటికైనా గోదావరి పరివాహక ప్రవాహం అంటని పై స్థలం కొనుగోలు చేసినిర్మాణం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు



05.09_Thur-Tharanam 1-8.qxd 9/4/2024 8:22 PM Page 6



# నడిరోడ్లో ప్రసవించినఆవు పట్టించుకోని యజమానులు



ఖానాపూర్ సెప్టెంబర్ 4(తరణం బ్యూరో ) నడిరోడ్డుపై ఆవు ప్రసవించి లేగకు జన్మనిచ్చింది నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ఆరో వార్డులోని నడి రోడ్డులో ప్రసవించిన సంఘటన యజమానుల నిర్లక్ష్యాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు హైందవ సాంప్రదాయంలో అవును గోమాతగా పూజించాల్సిన వ్యక్తులు నిండు గర్భిణిగా ఉన్న ఆవుల్ని సైతం ఇంట్లో మేత వేయలేక పట్టణంలో నడిరోడ్లపై విచ్చలవిడిగా వదలడం ఇక్కడ పరిపాటిగా మారింది అనేకసార్లు స్థానిక స్వచ్ఛంద యువజన సంఘాలతో పాటు ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ రోడ్లపై పశువుల్ని విడవరాదని దీనివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఎన్ని మార్లు విన్నవించిన యజమానుల్లో చలనం లేకపోవడం శోచనీయం ప్రజల ఒత్తిడిని తట్టుకోలేక ఇటీవల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై తిరుగుతున్న పశువులన్నిటిని స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్ లో కట్టేసి రోడ్లపై వదిలితే కఠినంగా శిక్షిస్తామని ప్రస్తుతం ఉన్న పశువుల్ని జరిమానా కంటే తీసుకెళ్లాలని దండోరా వేయించి యజమానులకు నచ్చచెప్పారు ఆవుల్ని సాకడం చేతకాకపోతే గోశాలకు పంపించాల్సిందే నని హెచ్చరించారు అయినా ఆవులను సాకే రైతులకు చీమకుట్టినట్లు కూడా కాకపోవడం బుధవారం నడిరోడ్లో ఆవు ప్రసవమే ఒక ఉదాహరణ, పశువుల్ని రోడ్లపై వదిలేయడం వల్ల ప్రమాదాలు పశువులతో పాటు ప్రజలకు ప్రమాదాలు జరిగి వాహనాలు ఢీకొన్న సంఘటనలు కూడా గతంలో జరిగాయి ఇప్పటికైనా ఆవులను సాకే రైతులు మానవతా దృక్పథంతో గోమాతగా తలచి కాపాడుకోవాలి తప్ప గర్భిణీఆవులను చూడకుండా గాలికి రోడ్డుపై వదలడం బాధాకరమని పట్టణ ప్రజలు ఆరోపించారు గోమాత (అవును) పూజిస్తూ తాను ఇచ్చే పాలు, పెడా,మూత్రం,కూడా పవిత్రంగా భావించే రోజుల్లో రోడ్లపై వదిలేయడం ఇకనైనా మానుకోవాలని లేనిపక్షంలో గోశాలలకు తరలించాలని పట్టణ ప్రజలు పశువుల యజమానులను కోరుతున్నారు

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు పూజా మహోత్సవము



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శేరిలింగంపల్లిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతీమాత చిత్రపటాలకు జ్యోతి ప్రదీపనము చేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య వై రెడ్డి శ్యామల, పీఠాధిపతి, భాషాభివృద్ధి పీఠము, తెలుగు విశ్వవిద్యాలయం విచ్చేసి శేరిలింగంపల్లి మండల పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, జవహర్ నవోదయ, గురుకుల బాలుర, బాలికల కళాశాలలు, రాయదుర్గం, కొత్తగూడ, శేరిలింగంపల్లి, మియాపూర్ జిల్లా పరిషత్తు హైస్కూల్స్ కాంప్లెక్స్ ల పరిధిలో గల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయు లలో 35 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను సాంప్రదాయ పద్ధతిలో (సన్నాయి మేళాల నడుమ వేద పండితుల ఆశీర్వచనము, శాలువా, జ్ఞాపిక, పగడి, పుష్పగుచ్ఛము, తాంబూలంతో) ఘనంగా సత్కరించటం జరిగింది. ఈ కార్యక్రమం తూనిక రాఘవేంద్రరావు (సామాజికవేత్త, బిల్డర్) సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్యామల మాట్లాడుతూ..ఈ సమాజంలో కులమత ప్రాంతాలకు అతీతంగా గౌరవింపబడే వృత్తి అధ్యాపక వృత్తి అని అన్నారు. వేద కాలం నుండి మాతా పితరుల తరువాత గురువుకు పెద్ద పీఠం వేసింది ఈ సమాజం, విద్యార్థులను అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించే వాడే గురువు, గురువు తను ఆర్జించిన విజ్ఞానాన్ని అంతా శిష్యులకు ధారపోసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే వాడు గురువు, సృష్టి, స్థితి, లయల నిర్దేశకుడే గురువు. అందుకనే గురు పూజా మహోత్సవము జరుపు కుంటున్నాము. మనదేశంలో సెప్టెంబర్ 5వ తేదీన ఈ గురుపూజా మహోత్సవాన్ని జరుపుకుంటున్నాము. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అసాధారణ ప్రజ్ఞాశాలి, రాజనీతి కోవిదుడు, విద్యావేత్త, ప్రజాస్వామ్య విలువలను నెలకొల్పడంలో నూ, విద్యకు సమున్నత స్థానాన్ని కల్పించడంలో ఆయన చూపిన చొరవ అయనను చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. ఆయన విశ్వవిఖ్యాత తాత్వికవేత్త, ఆయన అధ్యాపకుడిగా, ఆచార్య డిగా, ఉప కులపతిగా, యునెస్కో అధ్యక్షుడిగా, విదేశీ రాయబారిగా, స్వతంత్ర భారత ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సమాజానికి, దేశానికి విశేషమైన సేవలు అందించారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో పాఠాలను బోధించారు. ఆయనను కేంబ్రిడ్జ్, ఆక్స్ ఫర్డ్ లాంటి అనేక విదేశీ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం జరిగింది. ఆయన భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టారు. భారతదేశంలో అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన తరగతి గదులలో దేశ భవిష్యత్తు ఉంటుందని చాటి చెప్పారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారని సెలవిచ్చారు. ఉపాధ్యాయులే భవిష్యత్ సమాజ నిర్దేశకులు అని పేర్కొన్నారు. ఆయన ఉపాధ్యాయ వృత్తికి గుర్తింపు గౌరవాన్నికలిగించారు. ఆయన గొప్ప తాత్విక రచయిత. తత్వశాస్త్రంపై అనేక రచనలు చేశారు. ఆయన మన అందరికి ఆదర్శప్రాయుడు. ఆయన గౌరవార్థం ఆయన పుట్టినరోజైన సెప్టెంబర్ 5వ తారీఖును ఉపాధ్యాయ దినోత్సవంగా 1962 నుండి నిర్వహించుకుంటున్నాము అని తెలిపారు. నేటి యువ ఉపాధ్యాయులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని క్షేత్ర స్థాయిలో వస్తున్న పరిణామాలను నిశితంగా గమనిస్తూ నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులను ఆకళింప చేసుకొని భావిభారత పౌరులైన విద్యార్థిని విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించి వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయవలసిన సామాజిక బాధ్యత అధియాపకులదే అని అన్నారు. అధ్యాపక వృత్తికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని అధ్యాపకుల జీవనశైలి మిగతావారికి ఆదర్శప్రాయంగా ఉండే విధంగా నడుచుకోవాలి అని కోరారు. విద్యార్థులు గురువులు చెప్పిన విధంగా నడుచుకొని, ఎల్లవేళలా గురువులను గౌరవించాలి, వారి తల్లిదండ్రులు కూడా గురువులను గౌరవిస్తూ సహకరించాలి అని కోరారు.

ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రత్న ప్రభ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టీ.రాఘవేంద్రరావువివిధ పాఠశాలల, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వి. ఫణికుమార్, అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, జనార్దన్, పాలం శ్రీను, నేమానివిశ్వశాంతి, జి.వెంకటధర్మసాగర్ , విజయలక్ష్మి, త్రివేణి, మమతా ,సత్యవాణి,షౌరలక్ష్మి, జివి.రావు, బాలన్న, ఏమ్ ఏస్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు

# సైబర్ బాధితులు 1930 ఉపయోగించుకోవాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల



నిర్మల్ సెప్టెంబర్ 4(తరణం బ్యూరో ) ఇటీవల అనేక రకాలుగా మోసాలకు గురి చేస్తున్న సైబర్ నేరస్థల బారిన పడితే వెంటనే 1930 కోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల తరుణంతో చేరవాణిలో అన్నారు సైబర్ నేరస్తులు సెల్ ఫోన్ లో వాట్సాప్ లో ఇంస్టాగ్రామ్ లో రకరకాల మెసేజ్ లు పెడుతూ వాటిని క్లిక్ చేసే విధంగా మిస్ కాల్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు ముఖ్యంగా రైతు రుణమాఫీలో భాగంగా మెసేజ్లు పెట్టి వారి ఖాతాలోని సొమ్మును చేస్తున్న సంఘటనలు జరిగాయని అన్నారు ప్రజలు 1930 ను సమర్ధవంతంగా వినియోగించుకోలేకపోతున్నారని ఒకటి రెండు సార్లు దయల్ చేసి ఉన్నారని తెలిపారు సైబర్ నెలలకు సూచించిన ఈ నెంబర్ దేశవ్యాప్తంగా ఒకటే కావడం వల్ల ఎంగేజ్ వచ్చినప్పుడు కోటికి పదిసార్లు కాల్ చేయాలన్నారు దీంతో పోగొట్టుకున్న డబ్బు ఆగిపోతుందని తెలిపారు తదుపరి జరిగే పరిణామాల్లో డబ్బులు తిరిగి రాబట్టుకునే అవకాశం ఉందని 1930 ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు వాట్సాప్ సెల్ ఫోన్ లను వ్యక్తిగత సమాచారాన్ని గోపెయంగా ఉంచుకోవాలని ఈమెయిల్ ఐడి ప్రొఫైల్ పిక్ లను లాక్లలో పెట్టుకోవాలని అపరిచిత వ్యక్తులు తమకు సన్నిహితులుగా చేస్తున్న ఫోన్లకు మోసపోరాదని సూచించారు

# జిల్లాలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

## శాంతి కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ డా .జానకి షర్మిల

నిర్మల్ సెప్టెంబర్ 4(తరణం బ్యూరో ) నిర్మల్ జిల్లాలోని భైంసా మున్నూరు కాపు సంఘం లో గణేష్ ఉత్సవాల నిర్వహణ పై జిల్లా ఎస్పీ జానకి షర్మిల అవినాష్ కుమార్ తో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల భైంసా అధికారులతో శాంతి సమావేశం (పీస్ కమిటీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, పట్టణంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్మల్, భైంసా పట్టణంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద విద్యుత్, జనరేటర్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా రహదారులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని మున్సిపల్ శాఖ అధికారులు చూసుకోవాలని అన్నారు. మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ లూజ్ వైర్లు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణం లో గడ్డం వాగు ప్రాజెక్టు వద్ద సంబధిత అధికారులతో మాట్లాడి బార్కెట్లు, క్రేన్లు, అంబులెన్స్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ఘనంగా మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు. భైంసా ఏ.ఎస్పి అవినాష్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో వినాయక ఉత్సవాలను ఘనంగా, శాంతియుతంగా జరుపుకునేలా పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలతో పాటు నిరంతరం ఒక వాలంటీర్ ఉండేలా చూసుకోవాలి అని తెలిపారు. అధికశబ్దం వచ్చే డీజేలకు అనుమతి లేదని ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా హిందూ, ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో భైంసా ఏ ఎస్పీ అవినాష్ కుమార్ ఎస్పి ఇన్స్పెక్టర్ అశోక్, పట్టణ ఇన్స్పెక్టర్ రాజా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి,ఎం ఆర్ వో ప్రవీణ్ కుమార్, ఫైర్ ఆఫీసర్ రాజారాం, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సెప్టెంబర్ 4తరణం బ్యూరో )జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక గండి రామన్న సమీపంలోని ఫంక్షన్ హాల్ లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కలిసి భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా, వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది యొక్క బోట్లు, లైఫ్ జాకెట్లు, తదితర సామాగ్రిని పరిశీలించి అధికారులకు ఆమె పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంటి కాలనీలోని బస్తీ దవాఖనను పరిశీలించిన. .కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనీ మియాపూర్ డివిజన్ పరిదిలో గల హెచ్ ఏంటి కాలనీ లోని బస్తీ దవాఖానను స్టానికలుతో కలిసి పరిశీలించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..హెచ్ఎంటి కాలనీలోని బస్తి దావఖనను. బుధవారం పరిశీలించారు. వర్షాల దుష్ట ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సొంత వైద్యం తీసుకోకుండా దగ్గర్లో ఉన్న బస్తీ దవాఖానలో ని డాక్టర్లను సంప్రదించి అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, హెచ్ఎంటి కాలనీవాసులు, దేవేందర్ రావు, దశరథ్ రావు, విద్యానంద చారి, సురేష్, రమేష్ చంద్ర, నర్సింగ్ రావు, విరూపక్ష్యయ, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాపై స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం..పవన్ కళ్యాణ్



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (తరణం ప్రతినిధి):తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా పెట్టి మంచి పనిచేశారు అని అన్నారు. అసలు అక్రమ నిర్మాణాలు జరగకుండా అడ్డుకుంటే. ఎలాంటి సమస్యలు రాకుండా ఉంటాయి, పవన్హైడ్రా లాంటివి కచ్చితంగా ఉండాలి ఇప్పటికే కట్టిన భవనాలకు పరిహారం ఇచ్చి కూల్చేయాలి, మానవతా కోణంలో కూడా చూడాలి అని పవన్ కల్యాణ్ అన్నారు.మరో ప్రభుత్వం వచ్చినా అడ్డగోలుగా కట్టకుండాబ్యూరోక్రసీని కట్టుదిట్టం చేయాలి అని పవన్ కల్యాణ్ పేరొన్నారు. తెలంగాణలో మరో ప్రభుత్వం వచ్చే అవకాశమే లేదు అని అన్నారు. వరద బాధితులకు పవన్ కల్యాణ్ భారీ విరాళం..అరు కోట్ల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్ఏపీ, తెలంగాణకు ఒకో కోటి చొప్పున పవన్ విరాళం ప్రకటించారు. ఏపీలోని 400 పంచాయతీలకు రూ.లక్ష చొప్పున విరాళం ప్రకటించారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ప్రిన్సిపల్ సి హెచ్ శకుంతల వెల్లడి

ఖానాపూర్ (కడం )సెప్టెంబర్ 4(తరణం బ్యూరో ) నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లచ్చన్న ఎల్లాపూర్ లో గల సాంఘిక గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శకుంతల ఒక ప్రకటనలో తెలిపారు ఇంటర్ మొదటి సంవత్సరంలోని బైపిసి సెక్షన్లో 3సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు స్పాట్ అడ్మిషన్ సెప్టెంబర్ 5,6 తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అన్నారు అసక్తిగల బాలికలు అడ్మిషన్ పొందేందుకు పాల్గొనాలని కోరారు

# యూనివర్శిటీ పరీక్ష ఫలితాలు విడుదల

### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులప్రభంజనం







అన్నమయ్య సెప్టెంబర్ 4 (తరణం బ్యూరో)అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిపట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ మేనేజ్మెంట్ (ఎంబీఏ )విద్యార్థినీ విద్యార్థులు, యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎం.సీ. శ్రీ వర్షిత 82.75 % తో మొదటి ర్యాంకు, ఎస్. సుహాన 81%తో రెండవ ర్యాంకు,మరియు ఎస్. ఆస్మా , వి. భార్గవి, పఠాన్ ముబారక్80.62% తో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలియజేశారు .ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను మరియు ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ,ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, ఎంబీఏ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్ వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు అభినందించారు.

# గురువులేనిదే సమాజం లేదు...

### ఆదర్శప్రాయుడు డా సర్వేపల్లె రాధాకృష్ణన్ ... ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గడికోట శ్రీకాంత్ రెడ్డి.

అన్నమయ్య సెప్టెంబర్ 4( తరణంబ్యూరో ) గురువులేనిదే సమాజం లేదని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువు దైవంతో సమానమని,తల్లిదండ్రులు జన్మను ఇస్తే గురువు అక్షర జ్ఞానం ప్రసాదించి జీవితంలో వెలుగులు నింపుతారన్నారు. డా సర్వేపల్లె రాధాకృష్ణన్ స్వశక్తితో అసాధారణ ప్రజ్ఞా పాటవాలతో భారత దేశపు తొలి ఉప రాష్ట్రపతిగా,రెండవ రాష్ట్రపతిగా పనిచేసి ఆ పదవులకే వన్నెతెచ్చారని, సునిశిత రాజనీతిజ్ఞుడిగా,గొప్ప తాత్వికుడిగా తెలుగు కీర్తి బావుటాను ఖండాంతరాలలో ఎగురవేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి,ప్రతి విద్యార్థి మనసులో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వీధులు లేని పట్టణం, కోశాగారం లేని రాజు, వ్యాపారం లేని వర్తకుడు, గురువు లేని జీవితం... ఇవన్నీ ఒకే కోవకు చెందినవే...గురువు ప్రాధాన్యత ఎంతటిదో ఈ వాక్యమే తెలియ పరుస్తుందన్నారు. గత జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు.నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు.మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా జరుపుకుంటున్న ఉపాధ్యాయ దినోత్సవం రేపటి తరానికి మార్గదర్శకం కావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని సాకారం చేసుకునే దిశగా చేసుకునే ప్రయాణంలో ఉపాధ్యాయులు వారధిగా వుంటారన్నారు. విద్యార్థుల ఉన్నతికి అడుగడుగునా స్ఫూర్తిని నింపుతున్న ఉపాధ్యాయ లోకానికి శ్రీకాంత్ రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఒక్కరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగునిస్తుంది

### నేత్రదానంపై అవగాహన అవసరం
### జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

నెల్లూరు సెప్టెంబర్ 4(తరణం బ్యూరో )ఒక్కరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగునిస్తుందని, ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి అంధత్వ నివారణకు తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ వారి ఛాంబర్లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల వాల్పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంతోమంది కంటి చూపునకు దూరమై అంధకారంలో జీవిస్తున్నారని, వారికి చూపును ప్రసాదించేందుకు ప్రతిఒక్కరూ నేత్రదానం ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం మనదేశంలో సుమారు ఒక కోటి మంది మరణిస్తున్నారని, వీరిలో 2శాతం మంది నేత్రాలను దానం చేసినచో అంధత్వాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఈనెల 8వ తేదీ వరకు



జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ శార్వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్వో పెంచలయ్య, డిసిహెచ్ ఎస్ రమేష్ నాథ్, బి. శ్రీనివాసరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# టెక్నికల్ ఇంటర్వ్యూల పైన నిపుణుల వ్యూహాలు.

### ఏ ఐ అండ్ ఎం ఎల్ ఇంజనీర్ జె. పాల్ జోసెఫ్.

మదనపల్లి సెప్టెంబర్ 4, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ నందు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం వారు గెస్ట్ లెక్చర్ ను కోడ్ క్రాకింగ్ టెక్నికల్ ఇంటర్వ్యూల కోసం నిపుణుల వ్యూహాలు పై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి మరియు రిసోర్స్ పర్సన్ గా జె. పాల్ జోసెఫ్, ఏ ఐ అండ్ ఎం ఎల్ ఇంజనీర్, అసెంచర్ బెంగళూరు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ కు కోడింగ్ చాలా అవసరం అన్నారు. అప్లికేషన్లు, వెబ్సైట్లు మరియు డేటాతో ఇంటరాక్ట్ అయ్యే, అల్గారిథమ్లను అమలు చేసే మరియు ఆటోమేటెడ్ టాస్క్లను నిర్వహించే ఇతర డిజిటల్ సాధనాలను రూపొందించ డానికి కోడింగ్ ప్రోగ్రామర్ చాలా అవసరమని, ప్రతి ప్రోగ్రామర్ కు కోడింగ్ ఇంప్లిమెంటేషన్ చాలా అవసరమని అన్నారు. సమాచార సాంకేతికతకు వెన్నెముకగా పరిగణించ బడుతున్న కోడింగ్ వెబ్ అభివృద్ధి



మరియు వివిధ సాంకేతిక పరిష్కారాలలో కీలక పాత్ర పోషిస్తుంద అన్నారు. ప్రతి కంపెనీ లోను ఐ టీ నిపుణులకు కావలసిన ముఖ్య స్కిల్ కోడింగ్ అని, విద్యార్థులు కోడింగ్ పై దృష్టి సాధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో విభాగాధిపతి డాక్టర్ ఏం. శ్రీదేవి, గీత, వసుంధర లు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు ప్రాంగణంలో వాడుకలో లేని పాత ఫర్నిచర్ అమ్మకం

కడప, సెప్టెంబర్ 4 ( తరణం ప్రతినిధి)జిల్లా కోర్టు ప్రాంగణంలో వాడుకలో లేని, మరమ్మతుకు అనుకూలంగా లేనటివంటి పాత ఫర్నిచర్, చెక్క వస్తువులు, ఇతరత్రాలు వేలం ద్వారా విక్రఇస్తున్నట్లు ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని జిల్లా ప్రధాన జడ్జి కార్యాలయ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.వి.ఎం. కృష్ణ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా కోర్టు ప్రాంగణంలో వాడుకలో లేని, మరమ్మతుకు అనుకూలంగా లేనటివంటి పాత ఫర్నిచర్, చెక్క వస్తువులు తదితర 58 రకాల వస్తువులను (రూ. 40 వేలు అంతకన్నా తక్కువ కాకుండా బహిరంగంగా వేలం వేయుటకు నిర్ణయించారు), అలాగే డీజల్ జనరేటర్ యొక్క డోర్స్ (రూ. 5 వేలు అంతకన్నా తక్కువ కాకుండా బహిరంగంగా వేలం వేయుటకు నిర్ణయించారు), వేలం ద్వారా విక్రయిస్తారని అన్నారు. ఆసక్తి గల స్థానిక పరిసర ప్రాంతాల వారు తేదీ 2024 సెప్టెంబర్ 6వ తేదీన మధ్యాహ్నం 4.30 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణం నందు నిర్వహించే వస్తువుల వేలం పాటలో పాల్గొనేందుకు విరివిగా హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.షరతులు:-1) జయప్రదమైన వేలం దారులు డబ్బులు కట్టిన వెంటనే తన ఖర్చులతో పేర్కొన్న వస్తువులను తీసుకొని వెళ్ళవలెను అని అన్నారు.2) ఎటువంటి కారణాలను పేర్కొనకుండా వేలం తేదీని మార్చుకొనుటకు గాని వేలం రద్దు చేయుటకు గాని మా కార్యాలయం నకు అధికారం కలదు అని అన్నారు .3)వేలం సంతృప్తిగా లేనియెడల వేలం రద్దు చేయుటకు మా కార్యాలయమునకు సంపూర్ణ అధికారం కలదు అని అన్నారు.ఇతర సమాచారం కొరకు మా కార్యాలయం పని చేయు వేళలలో సంప్రదించగలరు అని అన్నారు

# సిద్దవటం, అట్లూరు పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ

### జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు





కడప సెప్టెంబర్ 4 (తరణం క్రైమ్ రిపోర్టర్)జిల్లాలోని సిద్దవటం, అట్లూరు పోలీస్ స్టేషన్ లను బుధవారం జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ లలోని రికార్డులను పరిశీలించారు.ఎస్.ఐ లు స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారుల నుండి పిటిషన్ తీసుకుని నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్దిష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.కొత్తగా స్టేషన్లలో బాధ్యతలు చేపట్టిన ఎస్.ఐ లు ఫిర్యాదు దారుల పిటిషన్ల ను రిజిస్టర్ లో పరిశీలించి ఎలా పరిష్కరించాలో చూడాలని ఆదేశించారు. పిటిషనర్ కు అనుకూలంగా జరిగిందా.లేదా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. పరిష్కారం అయ్యాయో లేదో అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు.పాత నేరస్థులు, సస్పెక్ట్ ల తో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. నేరాల్లో పాల్గొంటున్నారా లేదా అనే సమాచారాన్ని వారితో మాట్లాడి తెలుసుకోవాలని ఆదేశించారు. వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు.ఎస్.హెచ్.ఓ లు జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన చెక్ లిస్టు మేరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సి.డి ఫైల్ లో ఉంచి దర్యాప్తు ప్రక్రియ సజావుగా జరిగేలా, దర్యాప్తు నైపుణ్యం పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నేర సమీక్షా సమావేశంలో, ప్రతి రోజు తాము ఇచ్చే ఆదేశాలను క్రింది స్థాయి సిబ్బందికి తెలియచేయాలని ఆదేశించారు. ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూడాలని ఎస్.ఐ లను ఆదేశించారువివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు పిటిక్ వర్క్ లో భాగంగా స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి రోజులో సగ భాగం ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాల కు పాల్పడే వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు.

జిల్లా ఎస్.పి వెంట అదనపు ఎస్.పి జి.వెంకట రాముడు, ఒంటిమిట్ట సి.ఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్.ఐ వెంకట నాగ చిరంజీవి, అట్లూరు ఇంచార్జ్ ఎస్.ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

# విజయవాడ వరద బాధితులకు సహాయార్థం

### ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు చెక్కు అందజేసిన స్వచ్ఛంద సంస్థలు,పలు క్లబ్ ల ప్రతినిధులు



నెల్లూరు సెప్టెంబర్ 4(తరణం బ్యూరో )విజయవాడలో వరదలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు బాసటగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థలు,పలు క్లబ్ ల ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం.. ఎస్వీ రత్నం చారిటీస్ వ్యవస్థాపకులు శ్రీకంటి రామ్మోహన్ రావు,రోటరీ క్లబ్ వెస్ట్, ఇతర సంస్థల ప్రతినిదులు రెండు లక్షల రూపాయల నగదు చెక్కులను ఆయనకు అందజేశారు.గూడూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ను షిరిడీ సాయి బాబా మందిర కమిటీ ప్రతినిదులు లక్ష రూపాయలు, ఎస్వీ రత్నం చారిటీస్ వ్యవస్థాపకులు శ్రీకంటి రామ్మోహన్ రావు, రోటరీ క్లబ్ వెస్ట్ తరపున 50 వేల రూపాయల చొప్పున మొత్తం రెండు లక్షల రూపాయల నగదు చెక్కులను ప్రతినిధులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ.. విజయవాడలో తీవ్రమైన వరదలతో ఇబ్బంది పడుతున్న వారికి సాయం అందించేందుకు పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. వరద బాదితుల సహాయార్థం నా వంతుగా ఒక నెల జీతం లక్షా 50 వేల రూపాయలను విరాళంగా అందిస్తానని ఆయన తెలిపారు. ఇంకా మరికొందరు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకంటి రామ్మోహన్ రావు, దనుంజయ రెడ్డి, పాదర్తి ప్రసాద్.పీవీ క్రిష్ణయ్య,చెంచురామయ్య, గిరిబాబు, సనత్ కుమార్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

05.09_Thur-Tharanam 1-8.qxd 9/4/2024 8:22 PM Page 8



# ఇసుక రీచ్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ

## రైతుల భూములకు ఎలాంటి ఇబ్బంది లేదు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్

సిద్ధవటం సెప్టెంబర్ 4 పత్తి శ్రీనివాసులు తరణం విలేఖరి) సిద్ధవటం మండలం గుండ్ల మూల గ్రామంలో నూతన ఇసుక రీచ్ ఏర్పాటు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పాల్గొని ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.కొంతమంది రైతులు ఇసుక తవ్వకాలు వల్ల పెన్నా నది ఆనుకొని ఉన్న భూములు కోతకు గురైపోతాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు పెన్నా నది పరివాహ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు వల్ల మీ భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం తవ్వకాలు జరుగుతాయని అక్టోబర్ నెలలో మరో మారు గ్రామసభ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు ఆ ప్రాంత రైతులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మా పంట పొలాల వద్ద ఇసుక తవ్వకాలు జరుగుతూ ఉన్నాయని దాని ప్రభావం వల్ల పొలాలు కోతకు గురైపోతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఇసుక గుత్తేదారులు గడిచిన రోజుల్లో ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా జరిగాయని ఇకపై అలా జరగదని ప్రభుత్వ నిబంధన ప్రకారము రైతులకు భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తవ్వకాలు ఉంటాయని రైతులకు తెలియజేశారు ప్రతి ఒక్కరు కూడా ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని ఇసుక రీచ్ వల్ల గ్రామపంచాయతీ అభివృద్ధి చెందుతుందని రైతులకు ఎలాంటి డోకా ఉండదని తెలియజేశారు గతంలో ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా జరిగాయని ఇసుక కాంట్రాక్టర్లు నిబంధన ఉల్లగించి తవ్వకాలు జరిపారని ఇప్పుడు అలాంటివి ఏమీ ఉండదని రైతులకు తెలియజేశారు అయితే కొంతమంది ఇసుక రిచ్ పై అనుమతులు ఇవ్వొద్దు అంటూ వరుసగా గ్రామ సభలో ఫిర్యాదులు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు గత ప్రభుత్వంలో ఇలాంటి గ్రామసభలు ఎలాంటివి జరపకుండా అడ్డగోలుగా నిబంధనలు వ్యతిరేకించి ఇసుక తరలిస్తే ఫిర్యాదులు




ఎవరైనా చేశారంటూ పలువురు అభిప్రాయ వ్యక్తం చేశారు కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రజల అభిప్రాయం మేరకే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే కొంతమంది పని కట్టుకొని ఫిర్యాదులు చేయడంపై కొంతమంది అసహనం వ్యక్తం చేశారు జిల్లా కలెక్టర్ లో తోటి శివశంకర్ ను ఘనంగా పలు ప్రజా ప్రతినిధులు శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఇంజనీర్ శ్రీనివాసరావు కడప ఆర్డీవో వెంకటపతి, మైన్స్ శాఖ డిడి రవి ప్రసాద్, రాయల్టీ ఇన్స్పెక్టర్ విమల, అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు సిద్ధవటం మండల తాసిల్దార్ మురాద్వావలీ మండల అభివృద్ధి అధికారి జవహర్ బాబు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మానస మండల విస్తరణ అధికారి పులి రాంసింగ్ అగ్రికల్చర్ ఏవో రమేష్ రెడ్డి మండల ఆర్ ఐ అనురాధ, వీఆర్వో చలపతి పంచాయతీ సెక్రెటరీ రిహాన్ ఏపిఎం వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బమ్మ మాజీ సర్పంచ్ రాజశేఖర్ యాదవ్ జడ్పిటిసి సభ్యులు శ్రీకాంత్ రెడ్డి చెంచయ్య నాయుడు మల్లు వెంకట సుబ్బారెడ్డి నాగ ముని రెడ్డి సుబ్బారెడ్డి రిటైర్డ్ ఫారెస్ట్ గార్డ్ గంగన్న గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన చేయకుండా మండల ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు

# బడిపంతులుగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



సిద్ధవటం సెప్టెంబర్,4(తరణం విలేఖరి) సిద్ధవటం మండలం మూలపల్లె గ్రామంలో బుధవారం కడప జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు బడిపంతులుగా మారి విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో హెడ్మాస్టర్ శ్రీధర్ ను అడిగి వివరాలు సేకరించారు మండల పరిధిలోని బెటాలియన్ సర్కారీ బడికి గ్రామంలో నుండి అక్కడికి వెళ్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు విద్యార్థులకు అందిస్తున్న మెనూ సక్రమంగా అందించాలని విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందించాలని విధి నిర్వహణలో భాగంగా కచ్చితంగా ఉండాలని తెలియజేశారు గ్రామ ప్రజలు అందరూ కూడా స్కూల్ అభివృద్ధికి సహకరించాలని పిల్లల తల్లిదండ్రుల కమిటీ సమావేశం ఏర్పరిచి అభిప్రాయాలు సేకరించి విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ సూచించారు

# రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

## -ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభాషిని



చక్రాయపేట సెప్టెంబర్ 04 (తరణం విలేకరి )పౌష్టికాహార వారోత్సవాలు భాగంగా చక్రాయపట మండలం లోని కుమార కాలవ కస్పా, చెరువుకాంపల్లి ,కుమార్ కాలువ హెచ్ డబ్ల్యూ అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభాషిని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టిక ఆహారం వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. గర్భవతులకు బాలింతలకు కిశోర బాలికలకు రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. ఐరన్ సాంద్రత ఎక్కువగా ఉన్న



కూరగాయలు ,ఆకుకూరలు, రాగులు, జొన్నలు ,గుడ్లు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూర వంటి వాటిని తీసుకునే ఆహారంలో ఉండేలా ప్రతి ఒక్కరూ చూసుకోవాలని , వాటిపైన అవగాహన కలిగి ఉండడం అవసరమని తెలియజేశారు. గర్భిణీ స్త్రీలలో రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు . ఆకుకూరలతో పాటు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని కౌమార దశ నుండి ఆడపిల్ల లకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ఆయా పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాలలో ఈ మాత్రలు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు .ఈ యొక్క అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని మంచి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జిఎం ఎస్ కె మందాకిని హెల్త్ సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్, అంగన్వాడి కార్యకర్తలు శాంతకుమారి , ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట సబ్ జైలు, బద్వేల్ సబ్ జైలు విజిట్

## కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్







కడప, సెప్టెంబర్ 4 (తరణం ప్రతినిధి)2024 సెప్టెంబర్ 3వ తేదీన జాతీయ న్యాయసేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి సూచనల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ రాజంపేట సబ్ జైలును, బద్వేల్ సబ్ జైలును విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ జైల్ సూపరిండెంట్, బద్వేల్ సబ్ జైల్ సూపరిండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.- ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగులు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి సూచనల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ నందలూరు కోర్టు, సిద్ధవటం కోర్టు మరియు బద్వేల్ కోర్టుల నందు ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 సెప్టెంబర్ 14 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జ్ వైజే.పద్మశ్రీ, బద్వేల్ జూనియర్ సివిల్ సివిల్ జడ్జ్ బి.గాయత్రి, బార్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎక్సైజ్ అధికారులు, బ్యాంక్ అధికారులు మొదలగు వారు పాల్గొన్నారు.

# కడప కేంద్రకారాగారము కడప, కడప మహిళా కారాగారము రాయచోటి సబ్ జైలు విజిట్

## కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్



కడప, సెప్టెంబర్ 4 (తరణం ప్రతినిధి)2024 సెప్టెంబర్ 4 జాతీయ న్యాయసేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి సూచనల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ-కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవాధికార సంస్థ వారు కడప కేంద్రకారాగారము కడప, కడప మహిళా కారాగారము రాయచోటి సబ్ జైలును విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెటను, రిజిస్టర్ లను




పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహిళా కారాగారపు సూపరింటెండెంట్ , రాయచోటి సబ్ జైల్ సూపరిండెంట్ ఖైదీలు పాల్గొన్నారు.- లక్కిరెడ్డిపల్లి కోర్టు నందు ముందస్తు జాతీయ లోక్ అదాలత్ 2024 సెప్టెంబర్ 4వ తేదీన కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి సూచనల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ-కం -సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవాధికార సంస్థ వారు లక్కిరెడ్డిపల్లి కోర్టు నందు ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 సెప్టెంబర్ 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు, కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్ కరపత్రాలు పంచారు.ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కం జూనియర్ సివిల్ జడ్జ్ మండల న్యాయ సేవా సమితి షేక్ పాయి జున్నిస, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY KANAGUDURU NAGINI, PRINTED AT MARUTHI WEB PRINTERS, DOOR NO. 37/1342-2-3, CHALAMAREDDY PALLI , THILAKNAGAR, RAMANJANEYAPURAM, POST,KADAPA, Y.S.R / KADAPA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT EDITOR OFFICE 37/1342-2- 3 CHALAMAREDDY PALLI , THILAKNAGAR, RAMANJAYANEPURAM,POST,KADAPA, Y.S.R / KADAPA DISTRICT, ANDHRA PRADESH. EDITOR : N. ANJANEYA REDDY. RNI NO: APTEL/2016/69526, Cell : 7013748049 Email : tharanamkvsm@gmail.com.